అప్పు పుట్టట్లే.. ఎవరూ నమ్మట్లే!

- ఉద్యోగుల రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ రూ.8 వేల కోట్లు బాకీ ఉన్నం
- ఎక్కడి నుంచి తీసుకొచ్చి ఇవ్వాలె
- అన్ని నోటిఫికేషన్లు మేమే ఇవ్వలేదు
- వాళ్లకు టీటీడీ.. మనకు వైటీడీఏ ఉంది
- ధర్నాలు చేయడానికి అనుమతిస్తే మా మీదనే ధర్నాలు చేస్తున్నరు
- కొలువుల పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి విచిత్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఓవైపు ఆరు గ్యారెంటీలు అమలు చేయాలంటూ ప్రజలు డిమాండ్ చేస్తుంటే.. తమ బకాయిలు ఇవ్వాలంటూ ఉద్యోగులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ సర్కారు అస్తవ్యస్థ విధానాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పాతాళానికి చేరింది. దీంతో ఈ హామీల నుంచి తప్పించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బీద అరుపులను మొదలు పెట్టారు. వరుసగా సభల్లో పైసల్లేవు.. తానేం చేయలేననే విధంగా పరోక్ష సంకేతాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలోనూ అదే బీద అరుపులను సీఎం వల్లె వేశారు. 'ఎక్కడా అప్పు పుడుతలేదు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి పైసలు ఎక్కడి నుంచి తీసుకొచ్చి ఇవ్వాలంటూ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కొలువుల పండుగ కార్యక్రమంలో 922 మందికి నియామకపత్రాలు అందించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. 'ఈ రోజుకు 8 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నా దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. ఎట్ల తీసుకొచ్చి ఇయ్యాలా? ఏ అప్పూ పుడుతలేదు మార్కెట్లు.. ఎవ్వడూ మనల్ని నమ్ముతలేడు' అని పేర్కొన్నారు. 'రేవంత్ సీఎం అయ్యాక హుందాగా మారలేదు. అట్లనే దూకుడుగా ఉన్నాడు అంటున్నారు. నేను హుందాగా వ్యవహరిస్తే అర్థ చేసుకొనే వాళ్లు ఉండాలి కదా!' అని అన్నారు. హైదరాబాద్ నగరంలో భవన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలు అరికట్టేందుకే బిల్డ్ నౌ పోర్టల్‌ను తీసుకొచ్చామని, ఎంతటివారైనా సరే ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శక పరిపాలన అందించడమే తమ ఉద్దేశమని.. అదే గుడ్ గవర్నెన్స్ అని.. ఇది తెలంగాణ మోడల్ అని స్పష్టం చేశారు.

ఉద్యోగాల నోటిఫికేషన్లన్నీ మేం ఇవ్వలేదు..

నిన్న మొన్నటి వరకు తమ ప్రభుత్వం 57 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు గొప్పగా చెప్పుకొన్న సీఎం గురువారం ఇందులో కొంత వాస్తవాన్ని అంగీకరించారు. ఈ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అన్ని నోటిఫికేషన్లు తామే ఇచ్చామని చెప్పడం లేదని, గత ప్రభుత్వంలో కొన్ని నోటిఫికేషన్లు ఇచ్చారని, కొన్నింటికి పరీక్షలు నిర్వహించారని చెప్పారు. తద్వారా మెజార్టీ ఉద్యోగాలకు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణ పూర్తయిందని ఆయన అంగీకరించారు.

అందాల పోటీలు నిర్వహిస్తే బాధ ఎందుకు..

హైదరాబాద్‌లో ప్రపంచ అందాల పోటీలు నిర్వహిస్తే కొందరు బాధపడుతున్నారంటూ సీఎం వ్యాఖ్యానించారు. 'మిస్ వరల్డ్ పోటీలపై కూడా కొందరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మేము అందాల పోటీలు నిర్వహిస్తుంటే కేటీఆర్ నీ బాధ ఏందిరా నాయినా? పర్యాటక రంగానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు తెలంగాణలో ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలను సందర్శించబోతున్నారు. 72వ మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచం తెలంగాణ వైపు చూడబోతున్నది. భవిష్యత్‌లో వందల కోట్ల ఆదాయం రాబోతుంది' అని పేర్కొన్నారు. అదే విధంగా ఫార్ములా- ఈ రేస్ ముసుగులో ప్రభుత్వ సొమ్ము దోచుకున్నారన్నారని ఆరోపించారు. అయితే ఫార్ములా-ఈ రేసు కూడా సీఎం చెప్పినట్టుగా రాష్ట్ర పర్యాటకానికి, పెట్టుబడులకు ఉపయోగపడుతుందని నాటి ప్రభుత్వం చెప్పినప్పుడు అప్పుడు ఎందుకు వ్యతిరేకించారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ అందాల పోటీలతో తెలంగాణ వైపు ప్రపంచం చూస్తుంటే.. నాడు ఫార్ములా-ఈ రేసుతో సైతం ప్రపంచం తెలంగాణ వైపు చూసిందికదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాంటప్పుడు ప్రపంచ అందాల పోటీ నిర్వహణలో లేని తప్పు ఫార్ములా రేసు నిర్వహణలో ఎందుకొచ్చిందని నిలదీస్తున్నారు.

వాళ్లకు టీటీడీ ఉంటే.. మనకు వైటీడీఏ

వాళ్లకు టీటీడీ ఉంటే.. మనకు వైటీడీఏ(యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఉన్నదని, మనం కూడా పెద్ద సంస్థను ఏర్పాటు చేసుకున్నామని సీఎం చెప్పారు. ప్రతిసారి దర్శనాల కోసం వాళ్లను మనం అడుక్కోవడం ఎందుకు.. మనకు గుడులు లేవా? అని పేర్కొన్నారు. అయితే యాదాద్రిని తిరుపతితో పోల్చుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. యాదాద్రిని నాటి సీఎం కేసీఆర్ అభివృద్ధి చేసిన విషయాన్ని మాత్రం దాచేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాడు సీఎం కేసీఆర్ అకుంఠిత దీక్షతో దేవాలయాన్ని పునర్నిర్మించారు కాబట్టే.. నేడు ఆ గుడిని తిరుపతితో పోల్చుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక 'ధర్నాచౌక్‌లో ధర్నాలు చేయడానికి మా ప్రభుత్వం అనుమతిస్తే మా మీదనే ధర్నాలు చేస్తున్నారు..' అని వాపోయారు.

మాపై కోపమెందుకు?

'ప్రజలు తమపై కోపంగా ఉన్నారని కొందరు మాట్లాడుతున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ నియామకపత్రాలు అందిస్తున్నందుకు నాపై కోపంగా ఉన్నారా? అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు సోలార్ ఉత్పత్తి చేసే అవకాశం కల్పించినందుకు నాపై కోపం ఉంటుందా? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినందుకా? పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా? ఎందుకు మాపై కోపంగా ఉంటారు?' అని ప్రశ్నించారు.

వ్యవసాయంలో డిజిటల్ సేవలు

- జర్మనీ సంస్థ భాగస్వామ్యంతో చర్యలు
- మంత్రి తుమ్మలతో సంస్థ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, మార్చి 20(నమస్తే తెలంగాణ): వ్యవసాయంలో డిజిటల్ సేవల వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉన్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నూతన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక యంత్రాల ఉపయోగంతో కూలీల కొరతను అధిగమించడమే కాకుండా, అధిక దిగుబడులు పొందేలా సాంకేతికతను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జర్మనీకి చెందిన హెచ్ హెచ్ఐ సంస్థ ప్రతినిధులు మంత్రి తుమ్మలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సదరు సంస్థ సిరిసిల్ల జిల్లా వేములవాడలో పైలట్‌గా చేపట్టిన ప్రాజెక్టు వివరాలను మంత్రికి తెలిపారు. ఈ పరిశోధనలో భాగంగా మూడు ఎఫ్‌పీవోల నుంచి 55 మంది రైతులను ఎంపిక చేసి.. ఉత్పత్తి, కూలీల ఖర్చులు తగ్గించడం, పంట దిగుబడులు పెంచడం, నేల సారాన్ని పరీక్షించడం, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్న వివరాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డిజిటల్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జర్మనీ ప్రతినిధి డాక్టర్ రఘు చలిగంటి, డిజిటల్ అగ్రికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ సెబాస్టియన్, మార్టిన్, స్వెన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జనగామలో గౌడసంఘాల దీక్ష

- గౌడ సంఘాల సమన్వయ వేదిక పిలుపు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని కోరుతూ తెలంగాణ గౌడసంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం 'ఒకరోజు దీక్ష'ను నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, సభాధ్యక్షుడు వంగా సదానందగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట ఒకరోజు దీక్ష కార్యక్రమంలో పార్టీలు, రాజకీయాలకతీతంగా గౌడ బంధువులు పాల్గొంటారని తెలిపారు. బహుజన నాయకులు తమ దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే కార్యాచరణ ప్రకటిస్తామని గౌడ నేతలు పరశురాములు, సోమన్న, అంజనేయులు, సిద్ధూ, రఘు తెలిపారు.

కారుణ్య నియామకాలకూ ఆడంబరమేనా?

- గత జనవరిలోనే నియామక జీవో
- 2 నెలలు కాళ్లరిగేలా తిరిగిన లబ్ధిదారులు
- రవీంద్రభారతిలో 582 మందికి కారుణ్య నియామక పత్రాలిచ్చిన సీఎం

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కొన్ని సాధారణ ప్రభుత్వ ప్రక్రియలు కూడా కాంగ్రెస్ పాలనలో ప్రహసనంగా మారాయి. కారుణ్య నియామకాలు ఆయా శాఖల్లో సర్వసాధారణం. సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అనారోగ్యం, ప్రమాదం, ఇతర కారణాలతో మరణిస్తే ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనవద్దనే ఉద్దేశంతో ఆ కుటుంబంలోని అర్హత గల వ్యక్తికి ఉద్యోగం కల్పిస్తారు. ఇది ఆయా శాఖల్లో నిత్యం సాధారణ ప్రక్రియ. రాష్ట్రంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 582 మంది ఉద్యోగులు వివిధ కారణాలతో మరణించారు. ఆయా కుటుంబాల్లోని అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అలా కారుణ్య నియామకాలకు సంబంధించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ ఏడాది జనవరిలోనే జీవో జారీచేసింది. 582 ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాలు జారీచేశారు. అయినా, కారుణ్య నియామకాలు జరుగకపోవడంతో మళ్లీ ఈ నెల 6న మరోసారి ఆదేశాలు జారీచేశారు. రెండు నెలలు ఉద్యోగులను తిప్పించుకొని గురువారం రవీంద్రభారతిలో నియామక పత్రాలు అందించారు.

దుబారా చేయం.. అంటూనే బిల్డప్

దుబారా ఖర్చు చేయం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిచోటా చెప్తున్నారు. కానీ, నిరాడంబరంగా జరుగాల్సిన కారుణ్య నియామకాలను రాజకీయ లబ్ధికోసం, ప్రచారం కల్పించుకుంటున్నారని పరిశీలకులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితమే ఇవ్వాల్సిన కారుణ్య నియామకపత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇవ్వడం కోసమే ఇన్నాళ్లు ఆపివేశారా? అని ప్రశ్నిస్తున్నారు.

అట్టహాసంగా కొలువుల పండుగ

ప్రభుత్వం రవీంద్రభారతిలో గురువారం అట్టహాసంగా కొలువుల పండుగ నిర్వహించింది. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ, పురపాలకశాఖకు చెందిన 922 మంది ఉద్యోగులకు సీఎం నియామకపత్రాలు అందజేశారు. ఇందులో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖలో కారుణ్య నియామకాల కింద 582 మంది జూనియర్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ శాఖలో 55 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, 27 మంది జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో 38 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, 55 మంది జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు ఉన్నారు.

తెలంగాణ పతార పలుచన!

- రేవంత్ నోట దివాలా మాటలు
- రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు రావడం లేదు
- ఉన్న కంపెనీలు ఇతర రాష్ట్రాలకు జంప్

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణబ్రాండ్ ఇమేజ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు. తన మాటలతో తెలంగాణ పతారను పలుచన చేస్తున్నారు. సమయం, సందర్భం చూడకుండా ప్రతిచోటా 'దివాలా'కోరు వ్యాఖ్యలు చేస్తున్నారు. 'రాష్ట్రాన్ని అప్పుల పాలుచేశారు. ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇవ్వడానికి కష్టపడుతున్నాం. ఆర్బీఐ నుంచి రూ.4,000 కోట్లు చేబదులు తెస్తున్నాం. అప్పులు, వడ్డీలకే ఏడాదికి రూ.1.58 లక్షల కోట్లు చెల్లిస్తున్నాం' అంటూ ప్రతీ వేదికపై తెలంగాణ పరపతిని దెబ్బతీస్తున్నారు. గురువారం రవీంద్రభారతిలో ఉద్యోగులకు నియామక పత్రాలు ఇస్తూ కూడా అవే మాటలు వల్లెవేశారు. 'ఈ రోజుకు 8 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నా దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. ఎట్ల.. తీసుకొచ్చి ఇయ్యాలా? ఏ అప్పూ పుడుతలేదు మార్కెట్లు.. ఎవ్వరూ మనల్ని నమ్ముతలేరు' అని పేర్కొన్నారు. సీఎం రాష్ట్రం దివాలా తీసిందని, తమను ఎవరూ నమ్మడం లేదని చెప్పడంతో జాతీయ మీడియా తెలంగాణపై నెగెటివ్ దాడి మొదలుపెట్టింది. ఏ జాతీయ పత్రిక, చానల్ చూసినా 'ఆర్థిక సంక్షోభంలో తెలంగాణ' పేరిట కథనాలు వస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో తలసరి ఆదాయంలో టాప్‌లో నిలిచిన రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలోకి పడిపోయినట్టు పేర్కొంటున్నాయి. జాతీయ మీడియా కథనాలతో రాష్ట్రంలో ఏర్పాటైన జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఒక్కసారిగా కలవరం మొదలైంది. మీడియా ప్రచారంతో ఆయా సంస్థలు ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయి.

పుష్కలమైన వానలు... ఎండిన పంటలు

రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వర్షాలు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): "ఎండలతో పంటలు ఎండిపోతే నన్ను తిడుతున్నారు" ఇదీ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్య. అయితే పంటలు ఎండింది ఎండల వల్ల కాదని, ప్రభుత్వ అసమర్థత వల్లేనని రైతుసంఘాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక సర్వేను ఆధారంగా చూపిస్తున్నారు. వార్షిక బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన సర్వే నివేదిక ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధారణం కంటే 21.5 శాతం అధిక వర్షపాతం కురిసింది. ఓవైపు ప్రభుత్వమే పుష్కలంగా వర్షాలు పడ్డాయని చెప్తున్నది, కానీ పంటలు ఎందుకు ఎండిపోయినట్టో అసలు కారణాలు చెప్పాలని రైతుల సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి మీద నెపం నెట్టి, పాలకులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రభుత్వం కావాలనే కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టడంతో వర్షాలు కురిసిన సమయంలో నీళ్లను రిజర్వాయర్లకు మళ్లించలేకపోయిందని గుర్తుచేస్తున్నారు. చెరువులు ఎండి భూగర్భజలాలు అడుగంటాయని చెప్తున్నారు.

3750 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన డీసీపీ కోటిరెడ్డి

శామీర్‌పేట, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కర్ణాటక నుంచి డీసీఎంలో నకిలీ విత్తనాలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. గురువారం విలేకరుల సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాలు.. మంచిర్యాలకు చెందిన సొల్లు సురేశ్.. కర్ణాటక నుంచి పత్తి విత్తనాలు తీసుకురావాలని నరేశ్‌ను రూ.50 వేల కిరాయికి మాట్లాడుకున్నాడు. ఒప్పందం మేరకు నరేశ్ కర్ణాటక కొస్తంగికి చెందిన రమణ అలియాస్ రామయ్య నుంచి 3750 కిలోల (150 బస్తాలు) విత్తనాలను తీసుకుని టీఎస్19టీ3447 డీసీఎంలో మంచిర్యాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో శామీర్‌పేట ఓఆర్ఆర్ బ్రిడ్జి కిందకు రాగానే.. తనిఖీల్లో పోలీసులు నకిలీ విత్తనాలను గుర్తించి డ్రైవర్ నరేశ్‌ను అదుపులోకి తీసుకుని డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు సురేశ్ పరారీలో ఉన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తక్కువ ధరకే విత్తనాలు లభిస్తున్నాయని ఎక్కడపడితే అక్కడ విత్తనాలను కొనుగోలు చేయొద్దని రైతులకు డీసీపీ కోటిరెడ్డి సూచించారు.

దక్షిణ డిస్కంకు జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ టీజీఎస్‌పీడీసీఎల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీస్ ర్యాంకింగ్ (డీయూఆర్)రిపోర్ట్-కన్స్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్(సీఎస్ఆర్‌డీ) 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను కేటగిరీ పరంగా మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ కేటగిరీలో మొత్తం 41 విద్యుత్తు పంపిణీ సంస్థలకు ర్యాంకులు కేటాయించారు. దక్షిణ డిస్కం తన పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు, సరఫరాతో పాటు, ఇతర డిస్కంలతో పోలిస్తే అతి తక్కువ సమయంలో కనెక్షన్ల మంజూరు, అతికొద్ది పత్రాలతో వివిధ సేవలు పొందేలా చొరవ తీసుకున్నది. ఆయా సేవల వినియోగంలో నియమనిబంధనలను సరళతరం చేయడం కలిసొచ్చింది. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ వినియోగదారులకు, సిబ్బందికి, అధికారులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో సంస్థను మరింత ఉన్నత స్థితికి చేర్చేలా సమష్టిగా కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మలబార్ గోల్డ్ మరో 12 షోరూంలు

ముంబై, మార్చి 20: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ మలబార్ గోల్డ్ తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా దేశవ్యాప్తంగా రూ.600 కోట్ల పెట్టుబడితో 12 నూతన షోరూంలను ప్రారంభించబోతున్నట్లు మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, అమలాపురం, మచిలిపట్నంతోపాటు ఇతర నగరాల్లో ప్రారంభిస్తున్నది. అలాగే వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే ఏడాది భారత్‌తోపాటు విదేశాల్లో 60 నూతన షోరూంలను తెరువాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

ఈ-త్రీవీలర్‌లోకి హీరో

న్యూఢిల్లీ, మార్చి 20: యులేర్ మోటర్స్‌లో రూ.525 కోట్లతో 32.5 శాతం వాటాను దక్కించుకొని విద్యుత్తు ఆధారిత త్రిచక్ర వాహనాల వ్యాపారంలోకి హీరో మోటోకార్ప్ అడుగుపెట్టింది. ఈ డీల్‌పట్ల హీరో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజల్ ఆనందం వ్యక్తం చేశారు. యులేర్ మోటర్స్‌కు దేశంలోని 30 నగరాల్లో మంచి ఆదరణ ఉన్నది. ఇటీవలే ఇది ఎలక్ట్రిక్ కమర్షియల్ ఫోర్‌వీలర్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది.

డయాబెటిస్, ఊబకాయానికి ఔషధం

మౌంజారో పేరిట మార్కెట్‌లోకి తెచ్చిన ఎలీ లిల్లి

2.5 ఎంజీ వయల్ ధర రూ.3,500

న్యూఢిల్లీ, మార్చి 20: అమెరికాకు చెందిన ఔషధ రంగ దిగ్గజం ఎలీ లిల్లి.. భారతీయ మార్కెట్‌లోకి డయాబెటిస్, బరువు తగ్గే ఔషధాన్ని తీసుకొచ్చింది. దేశీయ డ్రగ్ రెగ్యులేటర్ నుంచి అనుమతులు లభించడంతో 'మౌంజారో' పేరిట ఈ డయాబెటిస్, వెయిట్-లాస్ డ్రగ్‌ను పరిచయం చేసింది. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం 5 ఎంజీ వయల్ ధర రూ.4,375గా, 2.5 ఎంజీ వయల్ ధర రూ.3,500గా ఉంటుంది. కాగా, లిల్లి తయారు చేస్తున్న ఈ ఔషధానికి ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తునే డిమాండ్ ఉన్నది. ఇక మౌంజారో రసాయనిక నామం టిర్జెపటైడ్. అమెరికా, బ్రిటన్, ఐరోపా దేశాల్లో ఇప్పటికే దీన్ని అమ్ముతున్నారు. బ్రిటన్, ఐరోపా దేశాల్లో మౌంజారో పేరుతోనే విక్రయిస్తుండగా, అమెరికాలో మాత్రం జెప్‌బౌండ్ పేరిట మార్కెటింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే భారత్‌కూ దీన్ని తేవాలని లిల్లి ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నది. ఇప్పుడు మార్గం సుగమమైంది. కాగా, భారత్‌లో 10 కోట్లకుపైగా జనాభా టైప్ 2 డయాబెటిస్, ఊబకాయం సమస్యలతో బాధపడుతున్నారు. వీరందరికీ మౌంజారో గొప్ప ఊరట కాగలదన్న ఆశాభావాన్ని లిల్లి ఇండియా అధ్యక్షుడు, జనరల్ మేనేజర్ విన్సెలో టక్కర్ వ్యక్తం చేశారు. మరోవైపు 2030 నాటికి ఈ ఔషధం అమ్మకాలు 150 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్న అంచనాలు మార్కెట్ విశ్లేషకుల నుంచి వినిపిస్తుండటం గమనార్హం.

హైదరాబాద్‌లో భారత్ బయోటెక్ కణ, జన్యు చికిత్స కేంద్రం

జీనోమ్ వ్యాలీలో రూ.650 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 20: హైదరాబాద్ ఆధారిత ఔషధ రంగ దిగ్గజం భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. ఇక్కడి జీనోమ్ వ్యాలీలో దాదాపు రూ.650 కోట్లతో ఓ కణ, జన్యు చికిత్స (సీజీటీ) కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది వైరల్ వెక్టర్ ప్రొడక్షన్ ఫెసిలిటీ కూడా అని గురువారం సంస్థ ప్రకటించింది. అలాగే దేశంలోనే ఇది తొలి వర్టికల్లీ ఇంటిగ్రేటెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కావడం గమనార్హం. 'సైంటిఫిక్ సవాళ్లను ఎదుర్కోవడంలో మా ఈ సెల్, జీన్ థెరపీ ఫెసిలిటీ ఓ నూతన శకానికి నాంది పలికింది' అని ఈ సందర్భంగా కంపెనీ ఓ ప్రకటనలో తెలియజేసింది. ప్రధానంగా క్యాన్సర్ వంటి జెనెటిక్ వ్యాధుల చికిత్సలో ఇక మంచి ఫలితాలు రాగలవన్న ఆశాభావాన్ని వెలిబుచ్చింది. ప్రస్తుతం జన్యు, కణ చికిత్సలు పెరిగిపోయాయని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా తెలిపారు. తమకున్న అనుభవంతో వైద్య విధానాన్ని మరింత మెరుగుపరుస్తామన్న ఆయన వైరల్ వ్యాక్సిన్ల తయారీలో తమ ప్రతిష్ఠ ఈ సీజీటీతో మరింత పెరగగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. ఆంకాలజీ, అరుదైన వ్యాధుల చికిత్సలపై తాము దృష్టి పెట్టామని, అందులో భాగంగా తెచ్చినదే ఈ సీజీటీ అని భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాచెస్ ఎల్లా అన్నారు. కాగా, ఈ కేంద్రం 50 వేల చదరపు అడుగుల్లో విస్తరించి ఉన్నది.

కదంతొక్కిన సూచీలు

- మళ్లీ 76 వేల పాయింట్ల పైకి సెన్సెక్స్
- 23 వేల మార్క్‌ను అధిగమించిన నిఫ్టీ

ముంబై, మార్చి 20: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. అంతర్జాతీయ సూచీలు మిశ్రమంగా ట్రేడైనప్పటికీ దేశీయ మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలు ఒక్కశాతానికి పైగా లాభపడ్డాయి. ప్రస్తుత సంవత్సరంలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నట్లు అంచనాలు వెలువడంతో గ్లోబల్ మార్కెట్లు పోటెత్తాయి. దీంతోపాటు బ్లూచిప్ సంస్థల షేర్లు ర్యాలీతో సూచీలు భారీగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చిరకు 899 పాయింట్లు లేదా 1.19 శాతం లాభపడి 76 వేల మార్క్‌ను తిరిగి అధిగమించింది. చివరకు 76,348.06 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 283.05 పాయింట్లు లేదా 1.24 శాతం ఎగబాకి 23 వేల పైకి 23,190.65 పాయింట్లను అధిగమించింది. 2025లో ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను రెండు సార్లు తగ్గించే అవకాశాలుండటంతో ఎఫ్ఐఐలు అమ్మకాలను నిలిపివేయడం సూచీలకు కలిసొచ్చిందని జియోజిట్ ఫైనాన్షియల్ అధినేత వినోద్ నాయర్ తెలిపారు.

- భారతీ ఎయిర్‌టెల్ షేరు అత్యధికంగా 4.17 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు టైటన్, టీసీఎస్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, నెస్లె, రిలయన్స్, మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, పవర్‌గ్రిడ్ షేర్లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి.
- అలాగే మారుతి, సన్‌ఫార్మా, ఎల్‌అండ్‌టీ, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, జొమాటో, అదానీపోర్ట్స్, టాటా స్టీల్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.
- కానీ, ఇండస్‌ఇండ